క్లుప్తంగా

యాదవ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్


శ్రీనివాస్‌యాదవ్

ఇల్లందకుంట: మండలంలోని గడ్డివానిపల్లి గ్రామంలో యాదవులందరూ కలిసి యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడిగా గడ్డి శ్రీనివాస్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్.. మాట్లాడుతూ యాదవులందరూ నాపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పడం సంతోషంగా ఉందన్నారు. తన వంతు కర్తవ్యంగా అప్పగించిన బాధ్యతకు న్యాయం చేస్తానని అన్నారు.

వీడ్కోలు హంగామా


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్ మాట్లాడుతూ.. నూతన టెక్నాలజీని విద్యార్థులు అవగాహన చేసుకుంటూ ఉండాలని, నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, మార్పులకు అనుగుణంగా అనేక ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.అనిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ యోగేశ్ కుండలి, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సతీశ్ కుమార్, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ప్రవీన్‌రావు, అకాడమిక్ ఇన్‌చార్జి మల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

సుందరేశ్వరుడికి ఫలపంచామృతాభిషేకం

విద్యానగర్(కరీంనగర్): మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో కొలువై ఉన్న సుందరేశ్వర స్వామి వారలకు వేద పండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, హారతి, ప్రత్యేకపూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయకమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సన్మానం


దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని భారత్‌టాకీస్ రోడ్‌లో గల వీరాంజనేయస్వామి ఆలయంలో గ్రేడ్-2 ఈవోగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వేణుగోపాల్ దంపతులను మంగళవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో అధికారులు సన్మానించారు. కొండగట్టు ఆలయ ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్, ఏసీ కార్యాలయ సూపరింటెండెంట్ సుప్రియ, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఉమా, ఈవోలు మారుతి, నాగుల అనిల్‌కుమార్, నాగారపు శ్రీనివాస్, మారుతీరావు, శంకర్, విక్రమ్, సిబ్బంది రమణారెడ్డి, మాజీ ఏసీ దూస రాజేశ్వర్, పలు ఆలయాల అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్?

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంకు చెందిన ఓ బాలిక కిడ్నాప్ అయినట్లు తెలిసింది. ఆమెను కరీంనగర్ పట్టణానికి చెందిన వ్యక్తి కిడ్నాప్ చేసి, ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిని పట్టుకొని, ఠాణాకు తరలించినట్లు తెలిసింది.

సర్కారు స్కూళ్లకు హంగులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చే విద్యార్థులకు చక్కటి సదుపాయాలతో స్వాగతం పలకాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం కింద మొదటిదశలో 10 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధికి రూ.62.55లక్షల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సౌకర్యార్థం డ్యూయల్‌డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డులను సరఫరా చేస్తున్నారు. మంగళవారం మొగ్దుంపూర్, దుర్శేడ్ తదితర గ్రామాల్లోని పాఠశాలలకు డ్యూయల్ డెస్కులను పంపించారు. ఒక్కో డెస్కులో ఇద్దరు విద్యార్థులు కూర్చునేలా ఏర్పాటు చేశారు. గతంలోనే మొదటిదశలో కొన్ని పాఠశాలలకు డ్యూయల్ డెస్కులను పంపిణీ చేశామని ఎంఈవో మధుసూదనాచారి తెలిపారు. ప్రస్తుతం రెండో దశలో మిగిలిన పాఠశాలలకు డెస్కులు పంపిస్తున్నట్లు వివరించారు.


వెదిర ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన వాషింగ్ ప్లాట్‌ఫామ్‌ను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు


తిర్మలాపూర్ గ్రామంలోని పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రియదర్శిని (ఫైల్)

సమీపిస్తున్న గడువు.. అసంపూర్తి పనులు

- నత్తనడకన మనఊరు–మనబడి పనులు
- రూ.1.65 కోట్లు మంజూరు చేసిన సర్కారు
- పనులు పూర్తి చేయడంతో అధికారుల అశ్రద్ధ

రామడుగు: ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం మన ఊరు–మన బడి పథకం కింద గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా పనులు ఆశించిన స్థాయిలో పూర్తి చేయలేని పరిస్థితి మండలంలో నెలకొంది. మరో వారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో విద్యార్థులకు మళ్లీ కష్టాలు తప్పవు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వసతులతోపాటు ఇతర మరమ్మతు పనులకు అప్పటి ప్రభుత్వం రూ.1,65,32,701 నిధులు మంజూరు చేసింది.

మండలంలో 12 పాఠశాలలకు

మండలంలోని దేశరాజ్‌పల్లి, రామడుగు, రుద్రారం, వెదిర, వెలిచాల, ప్రాథమిక పాఠశాలలతో పాటుగా గోపాల్‌రావుపేట, రామడుగు, రుద్రారం, వెదిర, వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వివిధ పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై రోజులు గడుస్తున్నప్పటికీ పనులు మాత్రం నత్తనడక సాగుతున్నాయి. రామడుగు, రుద్రారం, వెలిచాల పాఠశాలల్లో తప్పా మిగతా పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదని అధికారులు తెలిపారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు డబ్బులు రాకపోవడంతోనే పనులు చేయడం లేదని సమాచారం. మరో పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్న దృష్ట్యా అధికారులు పనులు పూర్తి చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధ్వంసం చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు

ఎంపిక చేసిన పలు పాఠశాలల్లో పనులు చేసినప్పటికీ రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నారు. వెదిర ప్రాథమిక పాఠశాలలో తాగునీరు, చేతులు శుభ్రం చేసుకోవడానికి నిర్మించిన ప్లాట్‌ఫామ్స్‌ను ధ్వంసం చేయడంతో ఎందుకు పనికి రాకుండా తయారైందని గ్రామస్తులు వాపోయారు. విద్యార్థులకు ఉపయోగపడే వాటిని ధ్వంసం చేయడం సరికాదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనులు పూర్తి చేస్తాం



మండలంలో 12 పాఠశాలలకు మనఊరు–మన బడి క్రింద నిధులు మంజూరు అయ్యాయి. అన్ని పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి కాగా మరికొన్ని పాఠశాలల్లో పనులు పూర్తి కావాల్సి ఉంది. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం.

– అంబటి వేణుకుమార్, మండల విద్యాధికారి, రామడుగు

బీజేపీ నాయకుల సంబరాలు


హుజూరాబాద్‌లో బీజేపీ నాయకుల సంబరాలు


చొప్పదండి పట్టణశాఖ ఆధ్వర్యంలో నాయకుల సంబరాలు

హుజూరాబాద్: బీజేపీ కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ గెలుపును హర్షిస్తూ మంగళవారం సాయంత్రం పట్టణంలో బీజేపీ నాయకులు టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. హుజూరాబాద్ పట్టణ ఉపాధ్యక్షుడు అంకతి శ్రీనివాస్, నాయకులు యమసాని శిశిధర్, గంగిశెట్టి ప్రభాకర్, రావుల వేణు, సబ్బని రమేశ్, నరాల రాజశేఖర్, యాళ్ల సంజీవరెడ్డి, తూముల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చొప్పదండి: పట్టణశాఖ ఆధ్వర్యంలో నాయకులు చొప్పదండిలో సంబరాలు నిర్వహించారు. మార్కెట్ చౌరస్తాలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, శ్రావణ్, వెంకటరమణ, మల్లేశ్, కుమార్, శ్రీరాం, అనూష్, శివక్రిష్ణ, సాయిక్రిష్ణ, చంద్రయ్య, మధు, సుధాకర్ పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి మాట్లాడారు. రెండోసారి బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించినందుకు ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మూడోసారి ప్రధానిగా మోదీ అధికారం చేపట్టనున్నారని అన్నారు. మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్, కత్తి ప్రభాకర్‌గౌడ్, సొన్నాకుల శ్రీనివాస్, ఆదిమూలం శ్రీనివాస్, సింగిరెడ్డి రమణారెడ్డి, ఆరెపల్లి సునంద్, కొండ్ర సురేశ్, రమేశ్ పటేల్, శీలం కుమార్, రంగు సంపత్‌గౌడ్, కొండ్ర వరప్రసాద్, ప్రదీప్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


మానకొండూర్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

శంకరపట్నం: కేశవపట్నంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, అనిల్, నరేందర్, అశోక్, కుమార్ యాదవ్, జగ్గారెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

పాడిపరిశ్రమ వైపు రైతుల మొగ్గు

- కరీంనగర్ డైయిరీ పరిధిలో 24 సంఘాలు
- ఇరవై సంఘాలకు పక్కా భవనాలు
- రెండు వేల మంది రైతులు, రోజూ 9వేల లీటర్ల పాల ఉత్పత్తి
- పశువులు, రైతులకు బీమా


సుందరగిరిలో పాలుపోస్తున్న రైతులు

చిగురుమామిడి: మండలంలోని రైతులకు సరిపడా సాగునీరు అందక తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు నుంచి మూడెకరాల భూమి ఉన్న రైతులు కేవలం ఇరవై గుంటల నుంచి ఎకరం వరకు సాగు చేస్తున్నారు. వ్యవసాయబావుల ఆధారంగా వరిసాగు చేసే రైతులు పంట చేతికందుతుందో లేదోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు, పెట్టుబడి భారం కారణంగా పంటలపై ఆశలు సన్నగిల్లిన రైతులు పాడిపరిశ్రమవైపు మొగ్గుచూపుతున్నారు. వేసవితో పాటు వానాకాలం పంటలు చేతికొచ్చే వరకు రైతులకు ఇతర ఆదాయ మార్గాలు లేవు. కుటుంబం గడవడానికి పాడిపరిశ్రను ఎంచుకుంటున్నారు. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఆవులు, గేదెలను సాకుతున్నారు. ఒకటి రెండింతో సరిపడా ఆదాయం రాక మరిన్ని పశువులు కావాలనే కోరుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందడం లేదు. మండలంలో కరీంనగర్ డెయిరీకి సంబంధించి 24 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలున్నాయి. రెండు వేల మంది రైతులు ఉదయం, సాయంత్రం 9000 వేల లీటర్ల పాలు పోస్తుంటారు. కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పశువులను కొనుగోలు చేసినా ఎలాంటి సబ్సిడీలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల సంరక్షణకు ఎలాంటి ఉపాధి పథకాలను ప్రవేశపెట్టకపోగా పాడి రైతులకు మొండిచెయ్యి చూపింది. సుందరగిరి, ఉల్లంపల్లి గ్రామాల్లో మాత్రమే పాడిపశువులను పంపిణీ చేసింది. కరీంనగర్ డెయిరీ చెందిన 24 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు ఇరవై పక్కాభవనాలున్నాయి. బండారుపల్లి, చింతపల్లి, ముదిమానిక్యం, గునుకులపల్లిలో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రైతులకు, పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తోంది, పశుగ్రాసం కోసం సబ్సిడీ అందించడంతోపాటు పాడి రైతుల ఆడపిల్ల పెళ్లికి పుస్తెమెట్టెలు అందిస్తోంది. దూడల సంరక్షణ పథకం ద్వారా లేగదూడలు జన్మిస్తే వాటి సంరక్షణకు రైతులకు రూ. ఐదువందలు ఇవ్వడంతో పాటు దాణా కూడా అందజేస్తున్నారు.

అవసరాలు తీరుతున్నాయి



ఇరవై పాడిపశువులున్నాయి, రోజు 150 లీటర్ల పాలు పోస్తాను. పదిహేను రోజులకోసారి రూ.యాభైవేలకు పైగానే పాల బిల్లు వస్తుంది. కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నాను. ఎనిమిది ఎకరాల వ్యవసాయభూమి ఉంది. అందులో ఒక ఎకరంలో పచ్చిగడ్డి పెంచుతున్నాను.

– ఇనుగాల నిరంజన్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారుడు, నవాబుపేట్

ఆరువందల లీటర్ల సేకరణ



ఉదయం, సాయంత్రం ఆరువందల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది. 180 మంది రైతులు సంఘంలో పాలు పోస్తున్నారు. ప్రతి పదిహేను రోజులకోసారి రైతులకు పాల బిల్లు పంపిణీ చేస్తున్నాను. కరీంనగర్ డెయిరీ సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తున్నాం.

– పన్యాల శ్రీధర్‌రెడ్డి, చిగురుమామిడి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



సహకార సంఘాల్లో పాలు పోస్తున్న రైతులకు ఏటా పాడి పశువుల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నాం. బీమా, పుస్తెమెట్టెలు, లాభాల్లో బోనస్, పశువులకు ఉచిత వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. రైతుల సంక్షేమమే మా ధ్యేయం.

– చింతపూల నాగయ్య, హుస్నాబాద్ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

హుజూరాబాద్: డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారుల కోసం ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు అందుబాటులోకి తీసుకొచ్చామని డీఈ లక్ష్మారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు ఆయా నంబర్లను సంప్రదించాలని కోరారు.

సెక్షన్	ఎఫ్‌వోసీ నంబర్	ఏఈ నంబర్
హుజూరాబాద్‌టౌన్	94910 75402	94408 11451
హుజూరాబాద్‌రూరల్	94910 74659	94408 11452
పెద్దపాపయ్యపల్లి	94910 74658	85001 20227
తాడికల్	94910 75204	94408 11454
ఆముదాలపల్లి	94910 75206	83339 23879
సైదాపూర్	94910 75199	94408 11461
జమ్మికుంటటౌన్	94935 84139	94408 11455
జమ్మికుంటరూరల్	94910 74661	94408 11456
ఇల్లందకుంట	79010 97141	94910 58669
తనుగుల	94910 75215	85001 20105
వీణవంక	94910 75373	94408 11457



తీశారు.. పక్కన పెట్టారు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామం ఆర్‌అండ్‌బీ రహదారి(హుస్నాబాద్–కరీంనగర్) పక్కన ఉన్న సింగిల్‌ఫేజ్ బోర్ మోటార్ కాలిపోవడంతో పైకి తీసి పక్కన పెట్టేశారు. మరమ్మతులకు అక్కడి నుంచి తరలించకపోవడంతో అధికారుల తీరుపై పలువురు విమర్శలు చేస్తున్నారు. మరో ఎస్సీ, బీసీ కాలనీ వాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా గ్రామ పంచాయతీ కార్యదర్శి బోర్ మోటార్‌కు తక్షణమే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. కాగా ఈ విషయంపై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌ను వివరణ కోరగా గ్రామంలో మొత్తం 13 సింగిల్ ఫేజ్ మోటార్లు ఉన్నాయని, వీటిలో బంజేరుపల్లి, 9వ వార్డులో పనిచేయడంలేదన్నారు. తక్షణం బోర్‌మోటార్‌కు మరమ్మతు చేయిస్తామన్నారు. ఎస్సీ కాలనీలో బోర్ మోటారు పనిచేయడంలేదన్నారు.

తిరుపతయ్య కళ్లు సజీవం




కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు (ఇన్‌సెట్లో) తిరుపతయ్య(ఫైల్)

జమ్మికుంట: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ సీనియర్ నాయకుడు గుండా తిరుపతయ్య(76) సోమవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందగా సదాశివ ఫౌండేషన్ నిర్వాహకుడు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు అంగీకారంతో తిరుపతయ్య కళ్లను వరంగల్ ఎల్‌వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో మంగళవారం సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంక్ పంపించారు. ఈసందర్భంగా నరహరి మాట్లాడుతూ.. మరణానంతరం నేత్రదానంతో ఇద్దరికి చూపును ప్రసాదించిన తిరుపతయ్య కళ్లు సజీవమే నని ప్రశంసించారు. సదాశివ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, నిర్వాహకులు మృతుడి భార్య సరోజన, కుమారులు రాజేంద్రప్రసాద్, ప్రవీణ్, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తమ గ్రీన్ పంచాయతీగా తిమ్మాపూర్



తిమ్మాపూర్ గ్రామపంచాయతీ


గ్రామంలో చెత్తను తొలగింపజేయిస్తున్న కార్యదర్శి మహేందర్‌రావు(ఫైల్)

తిమ్మాపూర్: జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య రహిత సంస్థలు, పంచాయతీలకు అవార్డులు ప్రకటించింది. ఉత్తమ గ్రామ పంచాయతీగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ పంచాయతీని ఎంపిక చేసినట్లు ఎంపీడీవో విజయ్ కుమార్, తిమ్మాపూర్ కార్యదర్శి మహేందర్ రావు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ప్రతిపాదన మేరకు సీఎస్ శాంతి కుమారి ప్రకటించారని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించే పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. తిమ్మాపూర్ పంచాయతీ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక కావడంపై మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.